# లవ్ మారేజ్

రచన:
కుమారి సి. హెచ్. కనకరత్నం

ఆఫీసులో గోడ గడియారం పది గంటలు కొట్టింది.

ఆఫీసు గుమస్తాలూ, అటెండర్లూ, టైపిస్టులూ, ఎవరి స్థానాల్లో వారు కూర్చుని పనులు చేసుకుపోతున్నారు. ఆఫీసు హాలులో అందరూ వున్నారు కానీ, ఆఫీసు హెడ్ గుమస్తా, మాధవరావు యింకా రాలేదు. ఆఫీసులో గుమస్తాలందరికీ ఆ రోజు ఆశ్చర్యమే వేశింది. దానికి ఒక ప్రత్యేక కారణమే వుంది.

ఆఫీసు వ్యానుకన్న రోజూ టైముకి ముందుగా ఆఫీసుకు వచ్చేది ఒక్క మాధవరావే. స్టాఫ్‌లో ఎవరయినా ఖర్మచాలక ఒక నిముషం ఆలస్యంగా వస్తే, ఆ రోజు సంజాయిషీ చెప్పుకోవలసిందేమరి! లేకపోతే మన జన్మలో చేసిన తప్పుల దండకం ఏకరువు పెడతాడు. అందుకే ఆఫీసు గుమస్తాలందరికీ అతనంటే ఒక పక్క భయమూ, ఒకప్రక్క తిరస్కార భావమూ వున్నాయి. అతన్ని ఏమనడానికి వీళ్ళకు పాలుపోదు. పాతయినా ఆఫీసుకు హెడ్ గదా! అందుచేత తమను ఎప్పుడు, ఎక్కడ నిలేసి అడుగుతాడోనని వారి గుండెలు ఎప్పుడూ పాథలుతూనే వుంటాయి.

అంత నిక్కచ్చిగా వ్యవహరించే మాధవరావు ఆ రోజు ఆఫీసుకు యింకా రాలేదంటే, 'స్టాఫ్' అందరూ ఆశ్చర్యంతో ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. ఏమయిందన్నట్లు! కానీ సమాధానం ఎవరిదగ్గిరా లభించలేదు. లభించదుకూడా!

ఆయన గురించి చెప్పుకోవాలంటే ఆఫీసులో చాలా గ్రంథమే వుంది. ముచ్చటగా మూడు పదులు దాటిన మాధవరావును, ఎవరయినా చూస్తే, అరడజను పిల్లల తండ్రి అని చాలామంది అపోహపడతారు. అలా అపోహపడ్డానికి అస్కారం లేకపోలేదు.

అలా అని ఎందుకు అన్నానంటే, అతను బ్రహ్మచారి. పైగా అంతో ఇంతో వెనక వేసినవాడూ, పైగా అందమయినవాడు. కానీ, అతను ఎందుచేత ఇంకా వివాహం చేసుకోలేదో ఎవరికీ అర్థంకాదు. అర్థం చేసుకోలేదుకూడా!

వారి తండ్రిగారు బ్రతికివున్న రోజులలో, ఎన్ని సంబంధాలు వెతికి తీసుకువచ్చినా పాపం ఆదేం ఖర్మో ఒక్క ఆడపిల్లకూ మన హీరోగారి రూపు రేఖా విలాసాలు నచ్చ(క)లేక అవన్నీ తిరిగిపోయాయి (ఏ). పాపం దానిలో యుక్తవయసులోవున్న మాధవరావు బక్కచచ్చిపోయాడు. అలా మరి కొన్నాళ్లకు ఆయుష్షు తీరిపోయిన ఆ తల్లి తండ్రులు కాలధర్మం చెందారు. కాలచక్రంలో సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. కానీ, మాధవరావుమాత్రం పెళ్ళిమాటే తలపెట్టలేదు. దానికి బదులుగా పట్టుదలతో చదివి ఓ. ఏ. పాసయి, ఈ ఆఫీసులో గుమస్తాలోంచి హెడ్ గుమస్తాగా ప్రవేశించి, డబ్బు, దానితోపాటు హోదా, గౌరవమూ పొందాడు.

ఆఫీసరుగారికి మాధవరావు అంటే మంచి నమ్మకమూ, గురీ, వున్నాయి. ఆఫీసుపని అంతా, చాలా కచ్చితంగా, కరెక్టుగా, చేస్తాడని తెలిసి, ఆఫీసరు గోపాలరావుగారు, అతన్ని గౌరవంగా, అభిమానంగా చూస్తాడు. ఆఫీసులో ఏ చిన్న అవసరం వచ్చినా, మాధవరావు, ఆఫీసరుగారి ప్రక్కన వుండవలసిందే! ఒకవేళ మాధవరావుకాని లేకపోతే ఆఫీసరుగారికి మతిపోయి, ఆ రోజు ఫైలు మర్నాటికి వాయిదా వేస్తారు.

ఆఫీసరు గారి ఆదరాభిమానాలను చూరగొన్న మాధవరావు అంటే, ఆఫీసు అంతటికీ ఒకవిధమయిన భయం, భక్తీ, గౌరవమూ వున్నాయి. ఎవరిమాటయినా కాదనగలరుగానీ, మాధవరావు మాటను ఎవరూ కాదనలేరు. కాదనడానికి ధైర్యంకూడ లేదు.

అటువంటి మాధవరావు బ్రహ్మచారి అని అంటే అతని చిన్ననాటి ఆప్త మిత్రులుతప్ప ఇతరులు ఎవరూ నమ్మరు.

మాధవరావు ఒక భగ్న ప్రేమికుడు!

అతను రాసి వుంచుకున్న జీవిత చరిత్రను తిరగవేస్తే, ఆ రహస్యం ఎంత నిగూఢంగా దాచుకున్నాడో అర్థమవుతుంది. అయినా, ఆ విషయం తెలిసినవాళ్ళు చాలా తక్కువ.

ఇపుడు వున్న గుమస్తాలు ఎవరూ చేరకముందు, మాధవరావు ఒక సామాన్య గుమస్తా. అతను పట్టుదలగా పనిచేసి, ఆఫీసరు మెప్పులను పొంది, చివరకు హెడ్ గుమస్తాగా ప్రమోషను పొందాడు మాధవరావు,

దశాబ్దం క్రితం జరిగిపోయిన ఆ గాథ, అప్పుడు వున్న గుమస్తాలకు లేడీ టైపిస్టు వాసంతిని గురించి క్షుణ్ణంగా తెలుసు. ఆ సంగతి, యిప్పుడున్న గుమస్తాల కెవరికీ తెలియదు. ఒకవేళ తెలుసుకోవాలన్నా, అంతక్రితం వున్న గుమస్తాలు ఎవరూ నేడులేరు. ఒకరి తర్వాత ఒకరుగా, దూరంగా బదిలీ అయిపోయి, ప్రస్తుతం క్రొత్త వారికి స్థానం యిచ్చారు. అందుకే, వాసంతీ, మాధవరావుల చరిత మాసిపోయి అడుగున పడిపోయింది. దానివలన మాధవరావు ఒక భగ్న ప్రేమికుడయ్యాడు అప్పుడు.

అప్పట్లో వాసంతిని ఎంతో గాఢంగా ప్రేమించాడు మాధవరావు. అతనికి వాసంతి అంటే ఎంతో అభిమానం, ప్రేమ వున్నాయి. ఆమె రూపాన్ని అతను మనసులో ఎంతో పదిలంగా దాచుకుని, ఎంతో ప్రేమతో పూజించాడు. వాసంతీ మాధవరావులు ఎంతో అన్యోన్యతగా వుండేవారు. నువ్వు ఏమనుకున్నా సరే! నిన్ను ప్రత్యేకంగా మనసులో దాచాను. నేను ఎపుడూ నీదాననే. అని ఆ నెరజాణ వాసంతి ఎంతో ప్రేమతో అన్న మాటలకు మాధవరావు ఆమెది నిజమైన ప్రేమ అని మురిసిపోయి, ఆమెను ప్రేమించడం ఏమిటీ తన ప్రాణాన్నే యిచ్చాడు ఆమెకు. తన కలలు ఫలించి, తన ప్రేమ రాణి అయిన వాసంతి తన సహధర్మచారిణి అవుతుందని ఎంతో మురిసిపోయి ఎన్నో తియ్యని కలలు కన్నాడు. పాపం మాధవరావు. అవి అన్నీ అభద్దాలనీ, నటన అనీ తెలుసుకోలేక పోయాడు మాధవరావు. మోసకత్తె అయిన వాసంతి, మాధవరావు జీవితంతో ఆడుకుని, అవసరం తీరిపోగానే యువకుడయిన అటెండరు నిత్యానందంతో పరారి అయిపోయింది వాసంతి.

ఆ దెబ్బతో కొన్నాళ్ళకుగాని, తేరుకోలేక పోయాడు మాధవరావు. అతి కష్టంమీద, అతన్ని మోసగించిపోయిన వాసంతి ప్రతిరూపాన్ని అతను స్మృతిపథంలోనుండి చెరపివేయగలిగాడు. అప్పటి నుండి, వివాహమునేమాట తలపెట్టనూలేదు. ఏ అమ్మాయినీ కనీసం కన్నెత్తి అయినా చూడలేదు. తను అందువలన తనకు తెలిసినవరల్లా, మాధవరావు ఒక భగ్న ప్రేమికుడనే సంగతి తెలుసు. అతని ప్రేమ విషయం తెలిసినవారు చాలా అరుదు.

గోడ గడియారం పదకొండు గంటలు కొట్టింది. ఆఫీసు వరండాలో బల్లమీద కూర్చున్న ఫ్యూను గురవయ్య పరుగెత్తుకువచ్చి, ఆఫీసరుగారు వస్తున్నారు, అన్న వార్తను మోసుకువచ్చి, వెళ్ళిపోయాడు.

గుమస్తాలు ఎవరి స్థలాల్లోకి వారు అతి నిశ్శబ్దంగా జారిపోయారు.

ఆఫీసరు గోపాలరావుగారు ఠీవిగా నడచుకుంటూ ఆఫీసు రూము వద్దకు వెళ్ళి, స్ప్రింగు డోర్ పైచేయి వుంచి, వెనుదిరిగి ఆఫీసు హాలువైపు పరకాయించి చూసారు. ఆఫీసరుగారి భయంవలన, గుమస్తాలందరూ, కాగితాలపై ఏదో అర్జంటుగా వ్రాస్తున్నట్లు తమ పెన్నులు మాత్రం బరబరా బర్కుతున్నాయి. హెడ్ గుమస్తా మాధవరావు టేబిలు మాత్రం ఖాళీగా వుంది. సదరు ఆఫీసరు గారికి ఈ విషయం తెలుసునేమోలాగుంది. రాలేదుకాబోలు అని అనుకుని స్ప్రింగ్ డోరు తెరచుకుని గదిలోకి వెళ్ళిపోయారు.

ఆఫీసరు గారు తలాంచుకుని, ఆనాటి అర్జంటు ఫైలు చూడటంలో మునిగిపోయారు. లెటర్ పాడ్ క్రింద లీవు లెటరు కనిపించింది ఆయనకు. చిరునవ్వు నవ్వుకున్నారు, ఆఫీసరు గోపాలరావుగారు.

ఆ తర్వాత, ఆఫీసు స్టాఫ్ అందరికీ తలొక వెడ్డింగు చేరినవి. ఆ వార్త వెడ్డింగు కార్డుకన్నా ముందు చేరవేసి వుంటాడు బక్షీసు ముట్టిన ఫ్యూను గురవయ్య.

వారం రోజులు తర్వాత ఆఫీసులో అడుగుపెట్టారు. నవ దంపతులైన మేరీ_మాధవరావులు. వారిని చూసి గుమస్తాలందరు స్టన్నయిపోయారు.

ఈ బ్రహ్మచారి మహాశయుడు స్టెనోగ్రాఫరు మేరీని ఎపుడు ప్రేమించాడూ! అని నోరు వెళ్ళబెట్టుకుని, తర్వాత బాగుందని, విధిలేక మేరీ మాధవరావులకు, కంగ్రాట్యులేషన్సు చెప్పుకున్నారు.

ఆ సాయంత్రం, 'హోటల్ బ్యూటీ'లో అందరికీ పార్టీ వుందనే శుభ వర్తమానం చెప్పి, అందరినీ మహాశ్చర్యంలో ముంచేసారు మేరీ మాధవరావులు. పార్టీ పేరు వినగానే గుమస్తాల ముఖాలు కలువ పువ్వులా వికశించాయి.

కానీ! అందులో ఒక ముఖం మాత్రం ఎండ సోకిన తామర పువ్వులా వాడిపోయింది.

పాపం! అతనెవరో కాదు. మేరీని ఎంతగానో ప్రేమించి, పూజించి, మనసులో ప్రతిష్టించుకున్న భగ్న ప్రేమికుడు అటెండరు గుర్నాథం.

[ఈ కథ కేవలం ఊహాగానం మాత్రమే! ఇందులో ప్రతీ సంఘటన ఊహింపబడినది. గాని, ఎవరినీ ఉద్దేశించి వ్రాసినదికాదు. గమనింప ప్రార్థన.]